క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: జేమ్స్‌స్ట్రీట్, పాటిగడ్డ, ఓయూ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్యారడైజ్ హోటల్ మెయిన్‌రోడ్డు, హెచ్‌డీఏ ఫ్‌సీ రోడ్డు. 11 నుంచి 12 వరకు పార్క్‌లేన్ రోడ్డు, అప్సానీ హోటల్, హార్ట్‌లీ కాంప్లెక్స్, పార్శి కాంపౌండ్. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చంద్రలోక్ కాంప్లెక్స్, ఓరియంట్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, ఎమరాల్డ్ హౌస్, నాన్‌కింగ్ ఎదురు ప్రాంతం, బీపీ పంప్, మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు స్వప్నలోక్ కాంప్లెక్స్ 1, 2, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బుద్ధభవన్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఓయూ డైరీ ఫామ్, పోస్టాఫీస్, పీజీ కాలేజ్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బీఈడీ కాలేజ్, మాణికేశ్వరినగర్, మోడల్ స్కూల్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

విద్యార్థుల అదృశ్యం.. గంట తర్వాత ప్రత్యక్షం



లాలాపేట: పాఠశాల నుంచి ఇంటికెళ్లాల్సిన నలుగురు విద్యార్థులు అదృశ్యమై కాసేపటికే ప్రత్యక్షమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. హబ్సిగూడలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్లో 6 వ తరగతి చదువుతున్న అరుష్, లోహిత్, చరణ్, విష్ణువర్ధన్ శనివారం పాఠశాల ముగిసాక ఇంటికి వెళ్లే సమయంలో రేపటి ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని ఓ బేకరీకి సమోసాలు తినడానికి వెళ్లారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న తల్లిదండ్రులకు వారి పిల్లలు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. తల్లిదండ్రులు స్కూల్ వద్దకు చేరుకోవడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది.పోలీసులు స్కూల్ వద్దకు చేరుకుని విచారణ చేశారు. గంటన్నర తర్వాత విద్యార్థులకు తిరిగి పాఠశాల వద్ద రావడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.కాగా, ఓ విద్యార్థిని పోలీస్ అధికారిణి ఎక్కడికెళ్లారని అడగ్గా ఎవరో తీసుకెళ్లారని ఏడుస్తూ చెప్పాడు.

'మనబస్తీ–మన బడి'తో పాఠశాలల్లో మార్పు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి

సనత్‌నగర్: పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎక్కువగా విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో మనబస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అక్షర అనే విద్యార్థిని తాను సేకరించిన వివిధ పుస్తకాలతో సనత్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని శనివారం మంత్రి ప్రారంభించారు. లైబ్రరీ ఏర్పాటుకు చొరవ తీసుకున్న చిన్నారి అక్షరను ఆయన అభినందించారు. లైబ్రరీలో అందుబాటులో ఉంచిన పుస్తకాలు విద్యార్థుల అక్షర జ్ఞానానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని మంత్రి అక్కడి విద్యార్థులను అడగగా తమ పాఠశాలలో అటెండర్, స్వీపర్స్ లేరని, సీసీ కెమెరాలు, డైనింగ్ హాల్ లేవని, వాటిని సమకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనంలో వడ్డించే కూరలు రుచికరంగా ఉండడం లేదని విద్యార్థులు మంత్రికి ఫిర్యాదు చేశారు. వెంటనే భోజనాన్ని సరఫరా చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడి నాణ్యమైన భోజనం వంటకాలను పంపాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం నాణ్యత లేని భోజనాన్ని తిప్పి పంపాలని ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జి హరిప్రియకు మంత్రి సూచించారు. పాఠశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కల్పించాల్సిన సౌకర్యాలతో నివేదికను అందజేయాలని సోమవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి పాఠశాలను సందర్శించనున్నట్లు మంత్రి తెలిపారు.

బోనాల చెక్కుల పంపిణీ..

వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని 22 దేవాలయాలకు బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ.8.68 లక్షల విలువైన చెక్కులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగలను గొప్పగా జరుపుకోవాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఏడాది రూ.15 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం..

కంటోన్మెంట్: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం నూతనంగా మంజూరైన 108 అంబులెన్స్, అమ్మఒడి వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఇప్పటి వరకు ఒక్క వాహనం కూడా లేదని, నేటి నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు. అదే విధంగా గర్భిణుల వైద్య పరీక్షల కోసం వారి ఇంటి నుంచి ఆస్పత్రి వరకు ఉచితంగా తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకొస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నగేష్, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, లాస్య నందిత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజకుమారి, బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని విమర్శించే స్థాయి క్రిశాంక్‌కు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్. శ్రీనివాస్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జరిగిన అభివృద్ధిపై ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ సిద్ధమని బీఆర్‌ఎస్ తరఫున ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్ సిద్ధమేనా అని బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్. శ్రీనివాస్ సవాల్ చేశారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్‌లో విలీనంపై కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేస్తుండగా కంటోన్మెంట్ బీజేపీ నేతలు వ్యతిరేకిస్తున్నారని బీజేపీ నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, ఇతర నాయకులపై చేసిన ఆరోపణలకు బీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించే స్థాయి క్రిశాంక్‌కు లేదని కంటోన్మెంట్‌లో డబుల్ బెడ్రూమ్ కేటాయింపులో పలు అక్రమాలు జరిగాయని, దళితబంధు అధికంగా బీఆర్‌ఎస్‌కు నాయకులకు మంజూరయ్యాయని ఆరోపించారు. అశోక్, మదన్, సతీష్, కిరణ్‌కుమార్, జైనపల్లి శ్రీకాంత్, కన్వీనర్ విజాయనంద్, ఇటిక దయానంద్, కిషోర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: అంధత్వరహిత నియోజకవర్గంగా సనత్‌నగర్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్, డాక్టర్ రవీందర్‌గౌడ్ స్పష్టం చేశారు. శంకర్ నేత్రాలయం బల్కంపేట, లయన్స్ క్లబ్, గ్రేటర్ బంజారా ఆధ్వర్యంలో బేగంపేట పాటిగడ్డ కమ్యూనిటీ హాల్లో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా పది మందికి ఆపరేషన్ చేయాల్సి ఉండగా బల్కంపేట శంకర్ నేత్రాలయంలో వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమాదేవిరెడ్డి, ఉపేందర్, అనంతకృష్ణ, రాజశేఖర్, జైపాల్‌రెడ్డి, కమల్‌రాజ్, షాబాద్ సత్యనారాయణ, శంషీద్దీన్ పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో..

రాంగోపాల్‌పేట: విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మహంకాళి ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్ పరశురాం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. శిబిరం నిర్వహణకు ముందుకువచ్చిన విశ్వకర్మ సంఘం ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, భాస్కర్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు నైతిక విజయానికి నాంది



చిలకలగూడలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు



పాలాభిషేకం చేస్తున్న నోముల ప్రకాశ్‌రావు

చిలకలగూడ: గుజరాత్ హైకోర్టు ఇచ్చిన రాహుల్ గాంధీ అనర్హత తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడం నైతిక విజయానికి నాంది అని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించడంతో చిలకలగూడలో కాంగ్రెస్ శ్రేణులు శనివారం సంబరాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు కుట్రపూరితంగా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవుడు వెంకట్, అంజిబాబు, ఆనంద్, శ్యామ్, సతీష్, ప్రమోద్, ఆంజనేయులు, రవిశంకర్ పాల్గొన్నారు.

రాహుల్ చిత్రపటానికి పాలాభిషేకం

సికింద్రాబాద్: రాహుల్‌గాంధీ చిత్రపటానికి సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావుగౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి ఊరట లభించిన నేపథ్యంలో నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాహుల్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాస్, నాయకులు సురేశ్‌లాల్, జగదీశ్వర్, వహీదుద్దీన్, అభిషేక్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష, జరిమానా

సనత్‌నగర్: బేగంపేట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ 10 మంది పట్టుబడ్డారు. వీరిలో ఐదుగురికి జైలు శిక్ష విధించగా, మరో ఐదుగురికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు. జైలు శిక్ష పడిన వారిలో నలుగురు మొదటిసారి పట్టుబడగా, ఒకరు రెండోసారి పట్టుబడినట్లు పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

సనత్‌నగర్: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణగౌడ్ వివరాల ప్రకారం.. మోతీనగర్ బబ్బుగూడకు చెందిన భిక్షపతి (70) ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులను ఆశ్రయించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్: ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కృష్ణగౌడ్ వివరాల ప్రకారం..ఎర్రగడ్డ బస్టాండ్ సమీపంలో భిక్షాటన చేస్తూ అక్కడే ఉండే ఓ వ్యక్తి ఈ నెల 3న చలనం లేకుండా పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద లభించిన ఆధారంగా టీఎస్ చక్రవర్తి, తండ్రి రాంచందర్‌రావు, యూసుఫ్‌గూడ, మధురానగర్ చిరునామా ఉందన్నారు. అయితే మృతుల కుటుంబ సభ్యులు ఎవరనేది ఇంకా తెలియలేదు. మృతుడికి 51 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, అతని ఒంటిపై ఆకుపచ్చ రంగు చొక్కా, గోధుమ రంగు, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వేణుగోపాలాచారి

సికింద్రాబాద్: సామాజిక ప్రగతి కోసం లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమైనవని తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. శనివారం సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలోని మాథూర్ విద్యాలయంలో సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వేణుగోపాలాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పాఠశాల పిల్లలతోపాటు వారి తల్లితండ్రులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన లయన్స్ క్లబ్ వైద్య బృందం ప్రతినిధులు అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రేసు మల్లారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కరస్పాండెంట్ ఆర్వీఎల్ఎన్‌ప్రసాద్, క్లబ్ ప్రతినిధులు కమల్‌కిషోర్ అగర్వాల్, రాజేంద్రప్రసాద్, సల్వ సాయిరాం పాల్గొన్నారు.

నేడు బోనాలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 6వ తేదీ జరగనున్న అమ్మవారి బోనాల వేడుకలు కోసం నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, భోలక్‌పూర్, ఐడీహెచ్ కాలనీ, సీసీనగర్, రైల్ కళారంగ్ బస్తీ, బండమైసమ్మనగర్ తదితర ప్రాంతాల్లోని పలు దేవాలయాల్లో అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఈ నెల 6 ఆదివారం బోనాలు వేడుకలు కాగా 7 తేదీ సోమవారం రంగం కార్యక్రమం, జల్లి కడవ ఊరేగింపులు జరగనున్నాయి.

పైపులైన్ పనులు ప్రారంభం

లాలాపేట: కలుషిత నీటి సమస్యకు చెక్ పెట్టేందుకు తార్నాక డివిజన్‌లో నూతన పైపులైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి తెలిపారు. తార్నాక స్ట్రీట్ నెంబర్–10లో రూ. 13 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎక్కడైనా కలుషిత నీటి సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే స్పందించాలని జలమండలి అధికారులకు సూచించారు. డ్రైనేజీ సమస్యలకు సత్వర పరిష్కారం చూపించాలన్నారు. జలమండలి డీజీఎం సరిత, మేనేజర్ నికిత, పాపారావు, స్థానికులు పాల్గొన్నారు.

బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో 14 వర్సిటీల ఉద్యోగ సంఘాల నేతల సర్వసభ్య సమావేశం జరిగింది. టీయూఎన్‌టీఈఏ అధ్యక్షులు బియ్యాని జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహించగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాజరయ్యారు. బడ్జెట్‌లో విద్యకు 6 శాతం నిధులు కేటాయించి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. టైంస్కేల్, కాంట్రాక్ట్, పార్టుటైం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజన్‌కుమార్ ఘోష్, పుల్లా శ్రీనివాస్, అమృతరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, శివశంకర్, నాగరాజు, అక్బర్‌బేగ్, భీమయ్య పాల్గొన్నారు.

సాయిచంద్ ఆశయ సాధనకు కృషిచేస్తా

ఉస్మానియా యూనివర్సిటీ: సాయిచంద్ ఆశయ సాధనకు జీవిత కాలం కృషి చేస్తానని ఆయన సతీమణి, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్ పర్సన్ వేద రజిని అన్నారు. శనివారం ఓయూలో నిర్వహించిన సాయిచంద్ యాదిలో పాటా–మాటా కార్యక్రమంలో రజిని హాజరై మాట్లాడారు. అనంతరం యశ్‌పాల్ రచించిన సాయిచంద్ స్మరణ పాటను ఆవిష్కరించారు. ఓయూ అధ్యాపకులు కాశీం, కొండ నాగేశ్వర్, వినయ్‌బాబు, రచయిత యశపాల్, కరుణ, రంజిత్, సురేందర్, సత్య, నాగన్న, ప్రసాద్, అర్జున్, పాల్గొన్నారు.

బస్తీవాసులకు న్యాయం చేయాలి

కంటోన్మెంట్: జీహెచ్‌ఎంసీలో విలీనం సందర్భంగా కంటోన్మెంట్‌లోని బస్తీవాసులకు న్యాయం జరిగేలా చూడాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం) డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు సీవీఎం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం ఏబెల్, సంకి రవీందర్‌ల నేతృత్వంలో ప్రతినిధుల బృందం సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసింది. కంటోన్మెంట్‌లో పలు ప్రాంతాల్లో రక్షణ, పౌర విమానయాన, రాష్ట్ర ప్రభుత్వ స్థలాల్లో బస్తీలు వెలిశాయన్నారు. దశాబ్దాలుగా ఆయా ప్రాంతాల్లోనే నివాసముంటున్న వారికి శాశ్వత నివాస యోగ్యత కల్పించాలని కోరారు. భూముల వర్గీకరణ ఆధారంగా కాకుండా బస్తీ వాసులకు న్యాయం జరిగేలా విలీన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. సీఈఓను కలిసిన వారిలో ఎలకంటి ప్రభు గుప్తా, మహమ్మద్ ఫసి అంబాల శ్రీనివాస్, గొల్లపల్లి అరుణ్ కుమార్ ఉన్నారు.

'డబుల్' ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో డబుల్ బెడ్రూమ్‌ల కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన శనివారం ప్రారంభమైంది. ఇప్పటికే ఫోన్‌కాల్ ద్వారా వివరాలు సేకరించిన హౌసింగ్ అధికారులు ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నారు. ఒక రెవెన్యూ మండలం పరిధిలోకి వచ్చే దరఖాస్తులను మరో మండలానికి చెందిన తహసీల్దార్ కార్యాలయ అధికారులతో పరిశీలన చేయిస్తున్నారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరు విభాగాల అధికారులు దరఖాస్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ.. 2019 లోపు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి మాత్రమే అధికారులు వివరాలు సేకరిస్తున్నారని ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

రైతులకు అండగా ఉంటాం

రాంగోపాల్‌పేట: ఫుడ్ కార్పొరేషన్ ఇండియా కమిటీ కార్యవర్గ సమావేశం శనివారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రైతులకు అండగా నిలబడుతూ వారితో కలిసి ముందుకుసాగాలని తీర్మానించారు. అనంతరం న్యాయమూర్తి ఎస్‌కే వర్మను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ మూర్తి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ

అడ్డగుట్ట: దళిత బహుజన ఫ్రంట్ డోనర్ బిహైండ్ సంస్థల ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్‌నగర్, లోహియానగర్‌లో 60 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, ఇతర స్టేషనరీ పంపిణీ చేశారు. బిహైండ్ డోనర్ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి వల్ల చాలా మంది పిల్లలు ఫీజులు చెల్లించలేక డ్రాప్‌అవుట్‌గా మారారని అలాంటి పిల్లలను గుర్తించి వారికి ట్యూషన్ల ద్వారా చదువు చెప్పిస్తున్నామన్నారు.

క్లీనింగ్ మెషిన్, స్టేషనరీ అందజేత

బౌద్ధనగర్: డివిజన్‌లోని అంబర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి పంపించిన క్లీనింగ్ మెషిన్‌ను శనివారం బీజేపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి మాట్లాడుతూ.. పిల్లలకు మంచి విద్యతో పాటు మంచి ఆరోగ్య అందించాలనే ఉద్దేశ్యంతోనే కిషన్‌రెడ్డి పాఠశాలకు క్లీనింగ్ మిషిన్ అందజేసినట్లు తెలిపారు. తమ వంతు సహాయంగా విద్యార్థులకు స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశామన్నారు. హరి, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రెడ్డి, మేకల కీర్తి, హనుమంతు, రాజేశ్వరరావు, శ్రీధర్, రాము వర్మ పాల్గొన్నారు.

ప్రజల చూపు కాంగ్రెస్ వైపు



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం లోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు పిడమర్తి రవి అన్నారు. శనివారం నియోజకవర్గం అన్నానగర్‌లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తున్నామని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. శాంసన్ రాజు, రామ్‌కుమార్, బల్వంత్ రెడ్డి, ఏసురత్నం, గుడ్డుభాయ్, సాయి, అన్నానగర్ మురళి, అష్రాఫ్, కవిత పాల్గొన్నారు.

ఆత్మీయ ఆలింగనం



ఓయూ పూర్వ విద్యార్థులు, ప్రియ మిత్రులు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ ఎల్లేష్ శనివారం ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం చాలా ఏళ్ల తర్వాత ఓయూకు వచ్చిన ఎల్లేష్, లక్ష్మీనారాయణలు కలిసి విద్యార్థులు, విద్యార్థి నేతలు, ఓయూ ఉద్యోగులుగా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నారు.

– ఉస్మానియా యూనివర్సిటీ